## ఉచిత తాగునీటి కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్: డివిజన్ పరిధిలోని బాలానగర్ వార్డు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కాలనీ వాసులు సమస్యలపై ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి కాలనీలో ముఖ్యంగా డ్రైనేజీ, మంచినీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. డ్రైనేజీ, మంచినీరు, శానిటేషన్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అంతే కాకుండా ఇందిరానగర్‌లోని అంబేడ్కర్ భవనం త్వరగా పూర్తి చేసి ఈ నెలలోనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఇంద్రానగర్‌లోని ప్రతి ఒక్కరూ ఉచిత తాగునీటి కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డివిజన్‌లోని సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

## 30న సహజ యోగా మహోత్సవం

హఫీజ్‌పేట్: సహజ యోగా మహోత్సవంను ఈ నెల 30వ తేదీ చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు సహజ యోగా రాష్ట్ర కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం చందానగర్‌లో రాష్ట్ర కమిటీ వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది యోగా సాధనతో ఆధ్మాతిక సంతృప్తిని పొందుతున్నారన్నారు. హైదరాబాద్ సహజ రియలైజేషన్ టూర్‌ని పెద్ద ఎత్తున నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. ఈ నెల 26 నుంచి 30 వరకు నిర్వహిస్తారని సుమారు 500మంది ప్రతినిధులు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్నారన్నారు. ఈ సహజ యోగా దినోత్సవానికి ప్రతి ఒక్కరు తమ కుటుంబంతో, స్నేహితులతో కలిసి రావాలన్నారు.

## అంతర్జాతీయ స్కేటింగ్‌లో తేజెష్ ఉత్తమ ప్రతిభ



తేజేష్‌ను అభినందిస్తున్న ఏసీపీ హనుమంతరావు, సీఐ నవీన్‌కుమార్

బాలానగర్: ఇంటర్నేషనల్ స్కేటర్ తేజెష్ పడిగ ఈనెల 13 నుంచి 17 వరకు జరిగిన అంతర్జాతీయ స్కేటింగ్ అండ్ ఓషియానియా, ఫసిఫిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఇన్‌లైన్ ఫ్రీస్కేటింగ్‌లో బంగారు పతకం, సోలో డాన్స్‌లో వెండి పతకం, ఫ్రీ స్కేటింగ్‌లో కాంస్య పతకం సాధించి భారత దేశ కీర్తిని ఇనుమడింపచేశాడు. ఈ సందర్భంగా తేజెష్ మాట్లాడుతూ ఇప్పటిదాకా జిల్లా, రాష్ట్ర జాతీయ, అంతర్జాతీయ విభాగాల్లో మొత్తం 93 బంగారు పతకాలు, 38 వెండి పతకాలు, 21 కాంస్య పతకాలతో కలిపి మొత్తం 152 పతకాలు సాధించానన్నారు. సెప్టెంబర్‌లో ఇటలీలో జరిగే చాంపియన్‌షిప్‌లో పాల్గొనాల్సి ఉందని ప్రభుత్వం, దాతల సహకారం కావాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, బాలానగర్ సీఐ నవీన్‌కుమార్ పతకాలు సాధించిన తేజెష్‌ని అభినందించి సత్కరించారు. ప్రపంచ స్కేట్ చాంపియన్‌షిప్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

సాక్షి,మేడ్చల్ జిల్లా: ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కీసర ఆర్డీవో కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. రెవెన్యూ అధికారులతో పాటు ఆపరేటర్లను ధరణి దరఖాస్తులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మాడ్యుల్స్ సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తులకు సంబంధించి అవసరమైన రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించాలన్నారు. డేటా కరెక్షన్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన తర్వాతే పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ భూములను అక్రమంగా కబ్జా చేస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించి వారిపై చట్టపరంగా క్రిమినల్ కేసులు పెట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో కీసర ఆర్డీఓ ఉపేందర్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రథమ చికిత్స కేంద్రాల సీజ్

నకిలీ వైద్యులపై ఎఫ్ఐఆర్ నమోదు




సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని బోడుప్పల్ శివ బాలాజీ , కొర్రెములలోని ఆర్ఆర్ ప్రథమ చికిత్స కేంద్రాలను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్.రఘునాథ్ స్వామి మంగళవారం సీజ్ చేశారు. అలాగే, సంబంధిత నకిలీ వైద్యులపై చర్యలకు ఆదేశించడంతో స్థానిక పోలీసులు వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రాష్ట్ర వైద్య మండలి చైర్మన్ ఆదేశాలతో మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో నకిలీ వైద్యులు అల్లోపతి వైద్యం చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించినట్లు డీఎంహెచ్ఓ పేర్కొన్నారు. అర్హతలు లేకపోయినప్పటికీ, పలువురు నకిలీ డాక్టర్ల అవతారమెత్తి, అల్లోపతి మందులు రాస్తూ.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలు, టీఎస్ఎంసీ చట్టం ప్రకారం నకిలీ వైద్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో జిల్లా డిప్యూటీ వైద్యారోగ్య అధికారి డాక్టర్ నారాయణరావు, కీసర డివిజన్ డాక్టర్ శోభన, నారాపల్లి వైద్యాధికారి పాపాని శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

- ప్రభుత్వ పాఠశాలల్లో 1,976 మంది విద్యార్థుల చేరిక
- ఈ నెలాఖరు వరకు కార్యక్రమం పొడిగింపు
- ప్రైవేట్‌లో ఫీజులు..పుస్తకాల మోతతో మారిన తల్లిదండ్రుల వైఖరి
- సర్కారు బడుల్లో ఇంగ్లిష్ మీడియం సహా ఇతర వసతులూ కారణం

# బడి బాట భళా..!

జిల్లాలో అనూహ్య స్పందన



సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో బడిబాట కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోంది. ఈ నెల 3 నుంచి 9 వరకు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల (విద్యార్థుల) పేర్లు నమోదును చేపట్టిన విద్యాశాఖ 12 నుంచి 19 తేదీ వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి స్పందన వస్తుండడంతో ఈ నెలాఖరు వరకు విద్యాశాఖ పొడిగించింది. జిల్లా విద్యాశాఖ చేపట్టిన బడి బాట కార్యక్రమంలో ఇప్పటి వరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 1,976 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ఇందులో ఒకటో తరగతిలో 1,194 విద్యార్థులు చేరగా, 2 నుంచి 10 వ తరగతిలో 782 మంది విద్యార్థులు ఉన్నారు.

### ప్రభుత్వ పాఠశాలలకు క్రమంగా ఆదరణ..

ప్రభుత్వ పాఠశాలలకు క్రమంగా ఆదరణ పెరుగుతోంది. కరోనా కష్ట కాలం నుంచి మొదలు.. ప్రైవేట్, కార్పొరేట్‌ల్లో ఫీజులు.. పుస్తకాల మోతతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన తల్లిదండ్రుల ఆలోచనా విధానంలోనూ మార్పు వచ్చింది. దీనికితోడూ ప్రభుత్వం సర్కారు బడుల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలతో విద్యార్థుల తల్లిదండ్రుల ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు.

### మండలాల వారీగా ఇలా...

జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తంగా 1,976 మంది విద్యార్థులు చేరారు. ఇందులో మేడ్చల్ మండలంలో 140 మంది విద్యార్థులు, కూకట్‌పల్లిలో 538, బాలానగర్‌లో 297, అల్వాల్‌లో 129, మల్కాజిగిరిలో 152, మేడిపల్లిలో 123, కాప్రాలో 24, శామీర్‌పేటలో 140, కీసరలో 148, ఘట్‌కేసర్‌లో172, మూడుచింతలపల్లిలో 117 విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు.

### ప్రభుత్వ బడులపై ఆదరణ పెరిగిందిలా..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో విద్యార్థుల తల్లి దండ్రుల అభిప్రాయాలకు తగ్గట్టుగా ప్రభుత్వం అన్నీ ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీషు మీడియం ప్రవేశ పెట్టింది. అలాగే మనఊరు-మన బడి-మన బస్తీ కార్యక్రమం కింద మొదటి విడతలో 176 ప్రభుత్వ బడుల్లో రూ.70 కోట్లతో మరమ్మతులు , మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో ఇప్పటివరకు 35 పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు.అలాగే, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో రూ.12.50 కోట్లతో 286 ప్రభుత్వ బడుల్లో మరమ్మతులు చేపడుతున్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతుండడంతో పాటు విద్యార్థులకు ఏకరూప దుస్తులు, ఉచిత పుస్తకాల పంపిణీ , మధ్యాహ్న భోజన పథకం వంటి సదుపాయాలను బడి బాట కార్యక్రమం ద్వారా జిల్లా విద్యాశాఖ ప్రచారం చేస్తోంది.

### కరోనా నేర్పిన పాఠం

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కరోనా కష్ట కాలంలో 2021-22 విద్యా సంవత్సరంలో 515 ప్రభుత్వ పాఠశాలల్లో 9,718 మంది విద్యార్థులు చేరారు. ఇందులో ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 3,408 మంది ఉన్నారు. అలాగే 2022-23లో జిల్లాలో కొత్తగా ప్రభుత్వ పాఠశాలల్లో 793 మంది చేరగా, ఇందులో ప్రైవేట్ విద్యా సంస్థల నుంచి వచ్చి చేరిన విద్యార్థులు 339 మంది ఉన్నారు.

### 27న నిధి ఆప్కే నిఖత్

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సంస్థ ద్వారా సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల్లో భాగంగా ఈ నెల 2 న నిధి ఆప్కే నిఖత్ 2.0 నిర్వహించనున్నట్లు ప్రాంతీయ భవిష్య నిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు కేంద్రాల్లో ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5:45 గంటల వరకు శిబిరాలు నిర్వహిస్తామన్నారు. చందానగర్ మైహోం జువెల్ అపార్ట్‌మెంట్ టవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని ఆల్ఫా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సదాశివపేట మండలం చందాపూర్‌లోని పెన్నార్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లలో భవిష్య నిధి సమస్యలు ఉన్న వారు పరిష్కరించుకోవాలని సూచించారు.

### తాగునీరు రోడ్డు పాలు



ఆర్‌కే సొసైటీ నాలుగు కూడళ్ల మధ్య ఉన్న రోడ్డులో వృథాగా తాగునీరు



మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ ఆర్‌కే సొసైటీ నాలుగు కూడళ్ల మధ్యన వాటర్ లీకేజీ కారణంగా స్వచ్ఛమైన తాగునీరు రోడ్డు పాలవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి లీకేజీలు కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పైపులైన్లకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



నీలిమ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

మోతీనగర్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తరచూ వైద్యుడిని సంప్రదించి వైద్యుల సూచన మేరకు మందులు వాడాలని నీలిమ ఆసుపత్రి కరస్పాండెంట్ డాక్టర్ పి. శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం మోతీనగర్ సమీపంలోని రాజీవ్‌నగర్ పార్కులో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుమేహం, బీపీ, చర్మ, దంత, కాళ్లు, చెవులు, ముక్కు, నోరు, సాధారణ సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోవృద్ధులు తరచూ వైద్యులను సంప్రదించి వైద్యుల సూచన మేరకు ఆహార నియమాలతో పాటు వ్యాయామం చేసినట్లయితే ఎటువంటి వ్యాధులు దరిచేరవని తెలిపారు. ముఖ్యంగా స్త్రీల సమస్యలపై గైనకాలజిస్ట్ అనుపమ పలువురి మహిళలకు వారు ఎదుర్కొంటున్న వ్యాధుల గురించి వివరించి కొంతమందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ నవీన్‌చంద్రారెడ్డి, అనుపమ, సంతోష్‌కుమార్, శ్రీతేజ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థులకు అందుబాటులో నిథమ్ కోర్సులు

ఫ్యాకల్టీ డాక్టర్ కిరణ్మయి,మిషెల్లీ జే ఫ్రాన్సిస్

రాయదుర్గం: ఇంటర్ పాసైన విద్యార్థులకు గచ్చిబౌలిలోని 'నిథమ్'లో పర్యాటక, ఆతిథ్య కోర్సులు అందుబాటులో ఉన్నాయని నిథమ్ ఫ్యాకల్టీ ప్రతినిధులు డాక్టర్ కిరణ్మయి, మిషెల్లీ జే ఫ్రాన్సిస్ మంగళవారం వెల్లడించారు. 30 ఎకరాల స్థలంలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన క్యాంపస్ అందుబాటులో ఉందన్నారు. నాలుగు ఏళ్ల కాలపరిమితితో కూడిన బీబీఏ డిగ్రీ (టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ), మూడేళ్ళ కాలపరిమితితో కూడిన బీఎస్సీ (హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) వంటి కోర్సులు ఉన్నాయన్నారు. 40 శాతం మార్కులతో పాసైన వారు చేరవచ్చన్నారు. 100 శాతం ప్లేస్‌మెంట్‌లున్న జాతీయ విద్యా సంస్థగా నిథమ్ గుర్తింపు పొందిందని వారు పేర్కొన్నారు. ఈ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి హోటళ్ళు, రెస్టారెంట్లు, ట్రావెల్, ఎయిర్‌పోర్టులు, ఈవెంట్స్, ఎంటర్‌టైన్‌మెంట్ వంటి వాటిల్లో అవకాశాలు లభిస్తాయని వారు పేర్కొన్నారు.

## 16 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 16 మందికి జరిమాన, మరో ఇద్దరికి జరిమానాతో పాటు జైలు శిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్ లో 18 మంది పట్టుబడ్డారు. వాహన దారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 16 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమానా,మరో ఇద్దరికి రెండు వేల జరిమానాతో పాటు ఒకరికి మూడు రోజులు, మరొకరికి రెండు రోజులు జైలు విధించినటు పోలీసులు పేర్కొన్నారు.

## పంచాయతీల్లో ప్రత్యేక మహిళా సభలు

- మహిళా శక్తిలో భాగంగా 61 జీపీల్లో నిర్వహణ
- సచివాలయంలో మేడ్చల్ మహిళా సంఘంతో క్యాంటీన్ ఏర్పాటు
- మహిళా సంఘాల్లో కొత్తగా 1,948 సభ్యుల చేరికపై కసరత్తు
- జిల్లాలో 16 మీ-సేవ కేంద్రాలను మహిళా సంఘాలకు అప్పగించేలా ప్రణాళిక

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక మహిళా గ్రామ సభలను మంగళవారం నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా 61 గ్రామ పంచాయతీల్లో సభలు ఏర్పాటు చేసినట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) అధికారి సాంబశివ రావు తెలిపారు. మహిళా సంఘం, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఇప్పటివరకు సంఘంలో లేని మహిళలను గుర్తించి చేర్పించడం, మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌లను గుర్తించి ప్రోత్సహించడం వంటి చర్యలు తీసుకోవాలని సభల్లో నిర్ణయించారు. అలాగే, కుట్టు శిక్షణ కేంద్రాలు, పాడి పరిశ్రమలు, పౌల్ట్రీ, మదర్ యూనిట్ల ఏర్పాటు, డెయిరీ పార్లర్లు, మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్, మహిళా క్యాంటీన్లు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి యూనిట్లను ఎంపిక చేసినట్లు డీఆర్డీఏ అధికారులు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే మహిళా శక్తి కార్యక్రమం కింద జిల్లాలోని ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులకు యూనిఫాంలు కుట్టించడంలో సఫలీకృతులైన విషయాన్ని ఈ సందర్భంగా అధికారులు ప్రస్తావించటంతో పాటు మహిళలను ప్రసంశించారు.అలాగే విద్యార్థులకు రెండో జత యూనిఫాంలు కూడా కుట్టేందుకు మహిళా సంఘాలను సన్నద్ధం చేసినట్లు పేర్కొన్నారు. తెలంగాణ సచివాలయంలో రెండు మహిళా క్యాంటీన్లను ఏర్పాటు చేస్తే ..అందులో ఒకటి మేడ్చల్ మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసే అవకాశం లభించడంతో జిల్లాకు మంచి గుర్తింపు వస్తుందని అధికారులు తెలిపారు. అలాగు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఆసుపత్రులు, టూరిజం స్పాట్‌లు, ఆలయాలు, ఇండస్ట్రియల్ ఏరియాలో మహిళా క్యాంటీన్లు ఏర్పాటు చేస్తే తప్పనిసరిగా సఫలీకృతమవుతామని గ్రామ సభల్లో పలువురు మహిళలు అభిప్రాయపడినట్లు డీఆర్‌డీఏ వర్గాలు తెలిపాయి. కొత్తగా ఏర్పడిన మహిళా సంఘాల సభ్యులను గుర్తించి వారిని గ్రూపుల్లో చేర్పించి, బ్యాంకు అకౌంట్లు ఓపెన్ చేయాలని నిర్ణయించారు. జిల్లాలో కొత్తగా 1,948 మందిని సభ్యులను గ్రూపుల్లో చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే ఈ ఏడాదిలో జిల్లాలో 16 మీ-సేవ కేంద్రాలను మహిళా సంఘం సభ్యులతో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్ణయించారు.

## మురుగు పొంగిపొర్లుతున్నా పట్టించుకోరా.?

ఇబ్బందులు పడుతున్న రాజీవ్‌గాంధీనగర్ వాసులు





రాజీవ్‌గాంధీనగర్ ఏ-బ్లాక్‌లో రోడ్డుపై పొంగిపొర్లుతున్న డ్రైనేజీ



మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ రాజీవ్‌గాంధీ నగర్ ఏ బ్లాక్‌లో గత కొన్ని రోజుల నుంచి డ్రైనేజీ పొంగిపొర్లటంతో ఆ రోడ్డంతా బురదమయంగా తయారైంది. అసలే వర్షాకాలం ప్రారంభం కావటంతో అకాల వర్షాలు ఎప్పుడు కురుస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. దానికి తోడు కొన్ని రోజుల నుంచి డ్రైనేజీ పొంగి పొర్లడంతో దుర్గంధం, దుర్వాసన వస్తుంది. సమీపంలో పాఠశాల ఉండటంతో ఆ మురుగు దాటుకుంటూనే విద్యార్థులు పాఠశాలకు వెళ్లవలసిన పరిస్థితి నెలకొంది. వృద్ధులు ఆరు బయటకు రాలేని పరిస్థితి. గతంలో పలుమార్లు డ్రైనేజీ పొంగుతున్న విషయాన్ని సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు కరువయ్యారు.

◆ చౌరస్తాకు సమీపంలోనే ఆ రోడ్డు ఉండటంతో సమీప నివాసితులు ఇంట్లో నుంచి అడుగు బయటకు పెట్టాలంటే ఇబ్బందులు పడుతున్నారు. నెలల కొద్దీ డ్రైనేజీ పొంగి రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. కింది స్థాయి సిబ్బందిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. అదేమిటని అడిగితే సిబ్బంది కొరత అంటూ సాకులు చెబుతూ నెలల తరబడి సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పొంగుతున్న డ్రైనేజీకి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## నేటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీ, రోడ్డు నంబర్ 2లోని శ్రీ వీరాంజనేయస్వామి, నీలకంఠేశ్వరస్వామి వారి దేవస్థానం 38వ వార్షిక మహోత్సవాలు 25వ తేదీ మంగళవారం నుంచి 27వ తేదీ గురువారం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ సుబ్బారావు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఉదయం 7 గంటలకు నిత్యహవనం, పంచముఖ ఆంజనేయ స్వామి అభిషేకం, వసంతోత్సవం, సాయంత్రం 6 గంటలకు సామూహిక లక్ష కుంకుమార్చన, మహాలక్ష్మీ హోమం, పూర్ణాహుతి తీర్థప్రసాద గోష్ఠి, 27వ తేది గురువారం సాయంత్రం 7 గంటలకు విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

**కేపీహెచ్‌బీ కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో....**

కేపీహెచ్‌బీ కాలనీ,రోడ్డు నంబర్ 4లోని పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం 31వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 25 మంగళవారం నుంచి జులై 1వ తేదీ సోమవారం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## బోనాల నిధులకు దరఖాస్తు చేసుకోండి

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



ఆల్విన్‌కాలనీ: బోనాల పండుగకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసే నిధులకు శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని దేవాలయాల నిర్వాహకులు జూన్ 30వ తేదీలోగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఇందుకు సమర్పించవలసిన పత్రాలు గుడి పేరు మీద ఉన్న లెటర్‌హెడ్, గుడి పేరు మీద ఉన్న బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్, గుడి ఫొటో, దేవాలయం చైర్మన్ లేదా కార్యదర్శి ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలను జత చేసి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## ఘనంగా కట్ట మైసమ్మ ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ రోజాదేవి రంగారావు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ వెంకటేశ్వరనగర్ 35 బ్లాక్‌లోని కట్టమైసమ్మ ఆలయం వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. జగద్గిరిగుట్ట కార్పొరేటర్ కొలుకుల జగన్‌తో కలిసి స్థానిక కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సంజీవరెడ్డి, సీనియర్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు, ఆంజనేయులు, దేవాలయం ప్రెసిడెంట్ ఎర్ర లక్ష్మయ్య, పల్లపు బాబు, భీంరాజ్, రాంబాబు, సురేష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు చర్యలు



అంబీర్ చెరువులో ఆయిల్ బాల్స్ వేస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువులో దోమల నివారణకు మంగళవారం ఎంటమాలజీ సిబ్బంది ఎంఎల్ఓ ఆయిల్ బాల్స్ వేశారు. నీటి నిల్వల్లో దోమలు గుడ్లు పెట్టి ఉత్పత్తికి కారణమవుతాయని ఆయిల్ బాల్స్ వేస్తే దోమలు వృద్ధి చెందవన్నారు. ఇంటి ఆవరణలో, బయట నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించాలన్నారు. దోమకాటు ద్వారా డెంగీ, మలేరియా, చికున్ గన్యా, మెదడువాపు, బోదకాలు వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌కాలనీ, నెక్స్ అపార్టుమెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దామోదర్‌రెడ్డి, ట్రెజరర్ ధర్మారెడ్డి, బ్రహ్మయ్య, బాలాజీ రెసిడెన్స్ అపార్టుమెంట్ గోపాల్ రాజు, గరికపాటి సాంబశివరావు, ఎంటమాలజీ సిబ్బంది మురళి, కనకయ్య, మధు పాల్గొన్నారు.

## పటేల్‌కుంట పార్కు పరిశీలన



హుడా పార్కును పరిశీలించిన కార్పొరేటర్ రోజాదేవి

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్‌లోని పటేల్‌కుంట పార్కును అధికారులతో కలిసి స్థానిక కార్పొరేటర్ మాధవరం రోజాదేవి మంగళవారం పరిశీలించారు. ఓపెన్‌జిమ్ మెయింటెనెన్స్ చేపట్టాలని కోరారు. వాకింగ్ ట్రాక్ టైల్స్, టాయిలెట్స్ రిపేర్ చేయాలన్నారు. సెప్టిక్ ట్యాంక్ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు హెచ్‌ఎండీఏ డీఈ జగన్, ఏఈ సంధ్య, పార్కు సభ్యులు చెన్నయ్య, కొండయ్య, రామచంద్రయ్య, హనుమంతరావు పాల్గొన్నారు.

## నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ బాబూరావు

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని టి. అంజయ్యనగర్‌లో నూతనంగా ప్రారంభించిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం మాజీ కార్పొరేటర్ పగుడాల బాబూరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్ట్యా పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఖాజా పాషా, ఫయాజ్, ఖలీల్ పాషా, మహబూబ్, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.